నేమ్ బోర్డు ఏదీ..?

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రహదారిలోని గ్రామాలపేర్లు గల సూచిక బోర్డులకున్న తీగలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. మండలంలోని బలిజపల్లి వద్ద గల టేకుమంద గ్రామ సూచిక బోర్డు పిచ్చి మొక్కలు అల్లుకుని గ్రామం పేరు కనబడకుండా ఉండదని, కొత్తగా వచ్చే వాహనదారులు దూరప్రాంతాలకు వెళ్లి విచారించి తిరిగి ఆ గ్రామాల చేరుకుంటున్నారని తెలిపారు. జాతీయ రహదారులను గ్రామాల పేర్లు మలుపులు పూర్తిగా పిచ్చి మొక్కలతో అల్లుకుంటున్నాయని ఎన్‌హెచ్ అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నా సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సూచిక బోర్డులకున్న పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

తొక్కిసలాట ఘటనపై
చర్యలు.. పరామర్శలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన బాధాకరమని ప్రతిఒక్కరూ భావోద్వేగ ప్రకటనలు చేశారు.. ఖచ్చితంగా టిటిడి, అధికార యంత్రాంగ సమన్వయ లోపం వల్లే జరిగిందని నిర్ధారించారు. సిఎం చంద్రబాబునాయుడు మృతుల కుటుంబాలకు 25 లక్షలు, బాగా గాయపడిన వారికి 5 లక్షలు, గాయపడిన వారికి 2 లక్షల చొప్పున ప్రకటించారు. టిటిడి సామాన్య భక్తుల సేవలో తరించాలని ఉన్నతాధికారులందరికీ వార్నింగ్ ఇచ్చారు. ఎస్‌పి, సివిఎస్‌ఒ, జెఇఒలపై బదిలీ వేటు పడింది. డిఎస్‌పి, గోశాల డైరెక్టర్‌లను సస్పెండ్ చేశారు. అర్ధరాత్రికే మంత్రులు స్విమ్స్, రుయా ఆస్పత్రులను సందర్శించి బాధిత కుటుంబీకులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఖచ్చితంగా ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు..డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ భక్తులు 'క్షమించాలి' అని వేడుకొన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి విచ్చేసిన సందర్భంగా ఆస్పత్రి వద్దనే పవన్‌కల్యాణ్ ఉండడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. జగన్మోహన్‌రెడ్డికి క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో కారు దిగి రోడ్డుపైనే నడచుకుని వచ్చిన జగన్మోహన్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. పట్టణ పౌరసంఘాల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించి బాధిత కుటుంబీకులకు నివాళి అర్పించారు.

మృతుల కుటుంబాలకు డి.శ్రీనివాసులు లక్ష ఆర్థిక సాయం

వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల కోసం క్యూలో వేచి ఉండి తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మతి చెందటం పట్ల చిత్తూరు మాజీ ఎంపీ , టిటిడి పాలక మండలి మాజీ చైర్మన్ ఆదికేశవులు నాయుడు కుమారుడు, పారిశ్రామిక వేత్త దలవాయి శ్రీనివాసులు తన ప్రగాఢ సంతపాన్ని, బాధను వ్యక్తం చేశారు. తన వంతు వ్యక్తి గత సాయంగా మతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ఆరు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేయనున్నట్లు వెల్లడించారు.

బాధితులను ఓదార్చిన మంత్రులు

తిరుపతి ఘటనలో చనిపోయిన మృతుల కుటుంబాలను రుయా మార్చురీ వద్ద మంత్రుల బృందం పరామర్శించింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, హోం మినిస్టర్ అనిత,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రాంనారాయణరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రివర్యులు కొల్లు పార్థసారథి ఉన్నారు. మృతుల బంధువుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇలా ఎవడైనా చేస్తాడా?

అధికారులపై చంద్రబాబు ఫుల్ సీరియస్

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితులను పరామర్శించిన అనంతరం కలెక్టర్, టీటీడీ అధికారులపై సీరియస్ అయ్యారు. సరిగ్గా ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి ప్రకారం పని చేయడం నేర్చుకోవాలని అధికారులకు క్లాస్ పీకారు. 2వేల మందే పడతారని తెలిసినా 2500 మందిని ఎందుకు పంపించారని మండిపడ్డారు. కొత్త ప్లేస్లో కౌంటర్లు పెట్టినపుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి కదా అని ప్రశ్నించారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న జగన్ మోహన్ రెడ్డి

మానవ తప్పిదమే తిరుపతి విషాదానికి కారణం'

కందారపు మురళి, టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు

మానవ తప్పిదం కారణంగానే తిరుపతి నగరంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారని స్పష్టమవుతున్నది. వెంకటేశ్వర స్వామి వారిని ఏకాదశి నాడు దర్శించుకుంటే మంచి జరుగుతుందని భావించి తిరుమలకు వైకుంఠ ఏకాదశి నాడు భక్తులు పోటెత్తడం ఆనవాయితీగా వస్తోంది. క్రౌడ్ మేనేజ్మెంట్ విషయంలో టిటిడి ఉద్యోగులకు ఉన్న అనుభవం, దేశంలో మరే ఆధ్యాత్మిక సంస్థలకు లేదనేది సుస్పష్టం. అయితే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తింది? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా చర్చ జరుగుతోంది. జరిగిన ఘటనలో వ్యక్తులకు, సంస్థలకు దురుద్దేశాలు ఆపాదించలేము. ఏ ఒక్కరూ ఇలాంటి ఘటనలు జరగాలని భావించరు. కాకపోతే వైకుంఠ ఏకాదశి నాడు లక్షల సంఖ్యలో జనం తిరుమలకు వస్తారన్న అంచనాలు ఉన్నప్పటికీ దానికై చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టత లోపించడం వైఫల్యం గా కనిపిస్తోంది. గతంలో స్థానికులకు మాత్రమే కేటాయించేవారు. ఈదఫా టోకెన్ లేని వారిని తిరుమలకు అనుమతించబోము అని యాజమాన్యంచేసిన ప్రకటన వల్ల 'నాన్‌లోకల్' భక్తులతో పోటెత్తింది. వేలాదిమంది పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టామని చెబుతున్నా రద్దీని ఎందుకు నియంత్రించలేకపోయారు. ఏ పాపం తెలియని అమాయకులైన భక్తులు వందల, వేల మైళ్ళ దూరం నుంచి స్వామివారిని దర్శించుకోవాలన్న కాంక్షతో తమ జీవితాలకు మంచి జరుగుతుందన్న ఆశతో వచ్చి ప్రాణాలు కోల్పోయారు.

డిశ్చార్జ్ అయ్యి తిరిగి వెళ్తున్న బాధితులు

ప్రక్షాళన మొదలు కావాలి : పవన్‌కల్యాణ్, డిప్యూటీ సిఎం

'తిరుపతిలో తప్పు జరిగింది క్షమించండి.. ఈ ఘటనతో ప్రక్షాళన మొదలు కావాలి' అని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనే ప్రణాళిక కూడా లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అధికారులు చేసిన తప్పులకు మేము తిట్లు తింటున్నాము. వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్నాయి. ప్రక్షాళన మొదలు కావాల్సిన అవసరం ఉంది. ఈవో శ్యామల రావు, ఏఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు ఛైర్మన్ మేల్కోవాలి. వి.ఐ.పి.లపై కాదు సామాన్యులకు దర్శనాలపై దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబాల దగ్గరకు టీటీడీ సభ్యులు, అధికారులు వెళ్ళి క్షమాపణలు చెప్పాలి" అన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

పౌరసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నివాళి

బుధవారం నాటి రాత్రి తిరుపతి నగరంలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన శ్రీవారి భక్తులకు తిరుపతి పౌర సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో దీపాలతో నివాళి అర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన భవనం ఎదురుగా గురువారం నాటి సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. సమాఖ్య కన్వీనర్ టి. సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నేత కందారపు మురళి, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. సాయిలక్ష్మి, సిఐటియు నేతలు జయచంద్ర, మాధవ్, ఆర్ లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, బాలాజీ, రామకష్ణ,బుజ్జి, నరేంద్ర, రాధాకష్ణ మల్లికార్జునరావు పాల్గొని నివాళులు అర్పించారు. మతుల కుటుంబాలకు న్యాయం చేయాలని జోహార్లు అర్పిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

మృతులకు నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భక్తుల మృతి బాధాకరం: ఎంఎల్ఏ గురజాల

చిత్తూరుఅర్బన్: తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లలో జరిగిన తొక్కిసలాటలో స్వామివారి భక్తులు మృతి చెందడం అత్యంత బాధాకర విషయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విచారం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తిరుపతి చేరుకొని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మెరుగైన వైద్య సేవలు అందించి బాధితులు త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి స్థానికంగా పర్యటించారు.

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి : ఎంపి

వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొక్కిసలాటలు చోటు చేసుకున్న ఘటనలో భక్తులు మృతి చెందడం ఆవేదన కలిగించిందని ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తిరుపతి నగరంలోని టికెట్ కౌంటర్ల దగ్గర క్యూలైన్ల నిర్వహణలో అధికారులు పోలీసులు తోడ్పాటు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజకీయం చేయడం తగదు: గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం: తిరుపతిలో వైకుంఠ దర్శన టోకన్ల కోసం సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతి చెందడం దురదృష్టకరమని టిటిడి బోర్డు మాజీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు అన్నారు.ఈ సంఘటనను వైసిపి అధినేత, నాయకులు రాజకీయ లబ్ది కోసం వాడుకోవాలని చూడటం, ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఘటనను రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడే వైకుంఠ ఏకాదశి

- శ్రీవారి ఆలయం ముస్తాబు
- తరలి వస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల: వైకుంఠఏకాదశి రోజున తిరుమలలో వెలసిన శ్రీవెంకటేశ్వుడిని దర్శించుకోవాలని శ్రీవారి భక్తులు కోరుకుంటారు. ఏడాదిలో ఒక్కరోజున వచ్చే వైకుంఠ ఏకాదశిని పరమపవిత్రంగా భావిస్తారు. అందుకనే ఆ రోజున శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు తహతహలాడుతారు. ఏడాదిలో ఏకాదశిలు 24 వచ్చినా ఉత్తరాయణం పుణ్యకాలం ముందువచ్చే ఏకాదశి రోజుకి మాత్రం పురాణాల్లో అత్యంత ప్రాముఖ్యత ఉంది. గురువారం వైకుంఠ ఏకాదశిలో శ్రీవెంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. ఇప్పటికే టిటిడి సామాన్య భక్తులకు ఏర్పాట్లను చేసింది. ఉదయం నాలుగు గంటల నుండి ప్రముఖులను దర్శనానికి అనుమతిస్తుంది. అనంతరం 8గంటలకు సామాన్య భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. గర్భ గుడి నుండి మహాద్వారం వరకు టిటిడి గార్డెన్ విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు నేతతంలో శ్రీవారి భక్తులు తన్మయత్వం చెందేలా అలంకరణలు చేశారు. మరో వైపు టోకెన్లలో ఉన్న సమయానికి తిరుమలకు చేరుకుని ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకోవాలని టిటిడి అధికారులు భక్తులకు విజ్ఞప్తి చేశారు. పెద్ద ఎత్తున ప్రముఖులు శ్రీవారి దర్శనానికి వస్తుండడంతో టిటిడి రిసెప్షన్ అధికారులు గదులు కేటాయింపులో నిమగ్నమయ్యారు. ఆలయ అధికారులు కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

తిరుమలకు చేరుకున్న ప్రముఖులు

బుధవారం సాయంత్రానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ రావు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యే లు వున్నారు.

నగరపాలక సంస్థలో టీడీఆర్ కమిటీ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అధ్యక్షతన టీడీఆర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా కమిటీ సభ్యులు టీడీఆర్ జారీ అంశంపై చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రికార్డులను పరిశీలించి, టీడీఆర్ జారీపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో టీడీఆర్ కమిటీ సభ్యులు ఏసీపీ నాగేంద్ర, తహశీల్దార్ కళావతి, సబ్ రిజిస్ట్రార్ విజయ్, చుడా పీవో మోహన్ ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడాపోటీలు

క్రీడా పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక మెసానికల్ క్రీడా మైదానంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ నేతృత్వంలో గురువారం దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. 100 మీటర్స్ పరుగు పందెం, షార్ట్ పుట్, జావలిన్ త్రో, బ్యాట్మెంటన్ డిఎస్‌డిఒ పర్యవేక్షణలో కోర్సులు రాఘవ కార్తీక్, రఫీ జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలను ప్రకటించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోహన్ బాబు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలకు ఈనెల 30, 31వ తేదీ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. దివ్యాంగులు ఎంతో ఉత్సాహంగా క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. మెసానికల్ క్రీడామైదానంలో పోటీలు నిర్వహించేందుకు సహకరించిన క్రీడాభివృద్ధి సంస్థ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు మురళి, చిన్న గుర్రప్ప, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నాగేశ్వర రావుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పంలోని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ వాయిల నాగేశ్వర రావుని ద్రవిడ యూనివర్సిటీ డాక్టరేట్‌ను గురువారం ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఇ.దిలీప్ పర్యవేక్షణలో 'టొరెంట్స్ ఆఫ్ ఇంటరాగేషన్ : ఎ క్రిటికల్ స్టడీ ఆఫ్ అరుంధతి రాయ్స్ సెలెక్ట్ నాన్- ఫిక్షన్' అనే అంశంపై సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించారు. వి.నాగేశ్వరరావు ప్రముఖ జర్నల్స్‌లో మూడు పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఈ అభినంద సభలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, అధ్యాపక అధ్యాపకేత్ర బృందం ఆంగ్ల అధ్యాపకులు నాగేశ్వరరావుని అభినందించారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- రీజనల్ డైరెక్టర్ పి.విశ్వనాథ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : వార్డు సచివాలయాల పరిధిలో ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పీజీఆర్ఎస్, ఆన్‌లైన్ ద్వారా అందే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.విశ్వనాథ్ అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆయన నగరపాలక సంస్థ పరిధిలో 49వ వార్డు తిమ్మసముద్రం సచివాలయాన్ని తనిఖీ చేశారు. వార్డు సచివాలయం పరిధిలో పన్నుల వసూళ్లపై సమీక్షించారు. డిమాండ్, ఇప్పటి వరకు చేసిన వసూళ్లు, బకాయిలు, దీర్ఘకాలిక బకాయిల వసూళ్లపై ఆరా తీశారు. పట్టణ ప్రణాళిక విభాగం సంబంధించి దరఖాస్తులు, అనుమతుల మంజూరు అంశాలను పరిశీలించారు. వార్డు సచివాలయంలో కార్యదర్శులు హాజరు నమోదు, మూమెంట్ రిజిస్టర్, పబ్లిక్ సర్వీసెస్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. వార్డు సచివాలయానికి వచ్చే ప్రజలతో సామరస్యంగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని, పన్నులను పూర్తిస్థాయిలో వసూలు చేయడం ద్వారా నగరపాలక ఆదాయం పెంచాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.విశ్వనాథ్

మొగిలి యానాదుల సమస్యలు పరిష్కరించాలి

శ్మశానం ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి
సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు డిమాండ్

మొగిలి యానాదుల సమస్యలపై మాట్లాడుతున్న వాడ గంగరాజు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం:మండలంలోని మొగిలి యానాదుల సమస్యలు పరిష్కరించాలని గురువారం యానాదులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, జిల్లా నాయకులు సురేంద్రన్, మండల నాయకులు మురళి పాల్గొని మాట్లాడారు. యానాదుల సమస్యలు పరిష్కరించాలని గతంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడం జరిగిందని, తర్వాత కలెక్టర్ స్పందించి సర్వే చేయించడం జరిగిందన్నారు. 59 ఎకరాల ప్రభుత్వ స్థలం మొగిలి ఊరగుట్ట స్థలంలో 12 మంది ఆక్రమణదారులు ఉన్నారని రెవెన్యూ అధికారులు తేల్చారని అయితే వాటి గురించి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. యానాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, స్కూలు, ఆట స్థలం, హాస్టల్ తదితర సమస్యలు కూడా పరిష్కారం చేయాలని కోరగా చేస్తామని హామీ ఇచ్చి ఆ ప్రతిపాదనలు ఇంతవరకు పంపకపోవడం సరైనది కాదన్నారు. స్మశానం కోసం 60సెంట్లు కేటాయించినప్పటికీ మళ్లీ ఆక్రమణదారులు వ్యవసాయం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్న రెవెన్యూ అధికారులు స్పందించలేదని అన్నారు. ఇప్పటికైనా ఊరగుట్ట ప్రాంతంలో యానాదులకు ఇండ్ల స్థలాలు ఇతర మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని దేశంలో వారి పోరాటాలు చేస్తామని తెలిపారు.

చెరిగిపోతున్న తీపి గుర్తులు

న్యూట్రిన్ ఫ్యాక్టరీ కూల్చివేత

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రపంచానికి చిత్తూరు జిల్లా నుండీ తీపిని పంచిన చిత్తూరు న్యూట్రిన్ ఫ్యాక్టరీ తీపి గుర్తులు చెరిగిపోతున్నాయి. జిల్లాలోని పులిచర్ల మండలానికి చెందిన నాటి పారిశ్రామిక వేత్త బివి.రెడ్డి నాటి జిల్లా కేంద్రమైన చిత్తూరులో న్యూట్రిన్ ఫ్యాక్టరీని 1953లో స్థాపించారు. అప్పట్లోనే జర్మనీ టెక్నాలజీతో చిన్నపాటికి మిఠాయిల ఫ్యాక్టరీగా ప్రారంభైన న్యూట్రిన్ ఫ్యాక్టరీ అంచెలంచెలుగా ఎదిగి దేశవిదేశాల్లో న్యూట్రిన్ ఫ్యాక్టరీలో తయారు చేసిన ఛాలెట్స్‌కు ఎంతో గిరాకీ ఉండేది.

నేలమట్టం అవుతున్న న్యూట్రిన్ ఫ్యాక్టరీ భవనాలు

ఇక్కడ తయారు చేసే చాక్‌లెట్స్‌లో మహాల్యాక్టో చాక్‌లెట్స్ చిన్న పిల్లల నుండీ పెద్దవారి వరకు ఎంతో ఇష్టంగా తినేవారు. ఈ చాక్‌లైట్స్‌తో పాటు చిన్న పిల్లలకు వివిధ రకాల చాక్‌లైట్స్‌ను తయారు చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ఫ్యాక్టరీలో 300 నుంచి 350 మంది కార్మికులు పని చేసేవారంటే ఏ స్థాయిలో ఇక్కడ చాక్‌లైట్స్ ఉత్పత్తి చేసేవారో అర్థం చేసుకోవచ్చు. కాలక్రమేనా ఫ్యాక్టరీ వ్యవస్థపకులు బివి.రెడ్డి మృతి చెందడం, ఆయన కుమారులు ఈ ఫ్యాక్టరీని కొంత కాలం నడిపినా మల్టీనేషన్ ఫ్యాక్టరీ దాటికి తట్టుకొలేక 2002లో ఓ మల్టీనేషన్ కంపెనీని న్యూట్రిన్ ఫ్యాక్టరీ ఆస్తులను కట్టబెట్టారు. ఈ మల్టీనేషన్ కంపెనీ కొత్త రకం చాక్‌లైట్స్ తయారు చేస్తూ కొంత కాలం నడిపాక లాక్‌డైన్ ప్రకటించింది. లాక్‌డైన్ ప్రకటించినాటికి 175 మంది కార్మికులు పని చేసేవారు. ఇందులో 100 మంది కార్మికులు వీఆర్ఎస్ తీసుకోగా మిగిలిన కార్మికులు మూడేళ్ళు పాటు తమకు న్యాయం చేయాలంటూ సుదీర్ఘకాలం ఫ్యాక్టరీ ఎదుట న్యాయపోరాటం చేశారు.

న్యూట్రిన్ స్థానంలో టెక్స్‌పార్క్, మాల్

దశాబ్దాల చరిత్ర కలిగిన జిల్లా కేంద్రమైన చిత్తూను నడిబొడ్డు బెంగుళూరు రోడ్డులోని న్యూట్రిన్ ఫ్యాక్టరీని చిత్తూరు జిల్లాలో పుట్టిపెరిగిన ఎన్ఆర్ఐ కొండా నరేంద్ర కొనుగోలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిత్తూరు ఎంఎల్ఏ గురజల జగన్‌మోహన్ ఇచ్చిన స్ఫూర్తితో పుట్టిన గడ్డకు మేలు చేయాలనే ఉద్దేశంతో న్యూట్రిన్ ఫ్యాక్టరీ స్థలాన్ని కొనుగోలు చేసి చిత్తూరు అభివృద్ధికి తొడ్పడంతో పాటు నగరంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా టెక్స్‌పార్క్, అత్యాధునిక షాపింగ్ మాల్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాతంలో ఏర్పాటు చేసే పార్కు, మాల్ వల్ల చిత్తూరు ప్రాంత అభివృద్ధితో పాటు అన్ని రకాల వసతులు కల్పించడబడతాయని అంటున్నారు. భూమి రేట్లు పెరగడం, అభివృద్ధి అటుంచితే.. ఉపాధి లేక అల్లాడుతున్న యువకు ఉపాధి లభించాలని స్థానికులు కోరుతున్నారు.

అంబరాన్నంటిన ముందస్తు సంక్రాంతి సంబరాలు

సోమలలో..

కుప్పంలో..

ప్రజాశక్తి- కార్వేటినగరం: మన సంస్కృతి సంప్రదాయలకు ప్రతీకగా చేసుకునే సంక్రాంతి సంబరాలతో జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఛాత్రోపాధ్యాయుల సందడితో అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు డైట్ ఆవరణాన్ని మామిడి ఆకుల రణాలు, చెరకు గడలు, పూల దండలు, గాలిపటాలు, రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ సంక్రాంతి సంభరాల్లో పాల్గొని ప్రసాదాలను పంచిపెట్టారు. భోగిమంటల చుట్టు అధ్యాపకులు కూడా ఛాత్రాపాధ్యాయులతో కలసి గొబ్బిళ్ళు తట్టడం తెలుగు సాంప్రదాయాన్ని తలపించింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న విశ్రాంతి సీనియర్ అధ్యాపకులు జయరామ నాయుడును ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు దేవప్రసాద్, చెంగల్ రాజు, రెడ్డివెంకట రమణ, నాగరాజు నాయక్, శ్రీనివాసులు, ప్రభాకర్, వహమద్ రఫీ, నిర్మల, సునీత, అనీత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదమరి: , డికె.చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాలను మామిడి ఆకులు, బంతిపూలతో సుందరంగా అలంకరించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలను ధరించి ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పొంగలి పెట్టి భోగిమంటలు, చెరకు గడలు పూజలతో పాటు గొబ్బి పాటలు పాడి అలరించారు. పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, కిరణ్ కుమార్, శ్రీరంగలక్ష్మి, మణి, గిరిబాబు, ఉమాదేవి పాల్గొన్నారు

సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గుల పోటీలు, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు చేశారు. కందూరు శ్రీ భారతి విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు కరస్పాండెంట్ మహమ్మద్ అంజాద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైయస్ డీగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి సంక్రాంతి పండగ విశిష్టత ఉట్టిపడేలా కళాశాల ప్రాంగణాన్ని ముగ్గులతో నింపారు. ఈ కార్యక్రమాన్ని ఐక్యూఏసి డాక్టర్ పూడి వెంకటేష్, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ భీమ మోహన్ రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మంగళ గౌరి నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులు బహుమతులు అందజేశారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని అక్కనగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం ప్రధానోపాధ్యాయులు ఆర్.గంగాధరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం భోగి మంటలు వేసి ప్రసాదాలు పంచిపెట్టారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని 49 కొత్త పల్లెమిట్ట హైస్కూల్‌కు చెందిన ప్లస్ విద్యార్థి సి.గాయత్రి జిల్లాస్థాయిలో జిల్లా విద్యా శిక్షణ సంస్థ కార్వేటి నగరంలో బుధవారం జరిగిన రంగోత్సవ్ పోటీలలో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే 9వ తరగతి విద్యార్థి ఎం.సౌమ్య ప్రీతిని అభినందిస్తూ అమరావతిలో నిర్వహించబోయే పోటీల్లో కూడా నెగ్గి జాతీయ స్థాయికి ఎన్నిక కావాలని స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి, ఉపాధ్యాయులు అభినందించారు. రెడ్డప్ప నాయుడు, హేమలత, ఉమామహేశ్వరి, ధనంజయులు, వాణిశ్రీ, శ్రీనివాసులు, డాక్టర్ బండి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని టేలర్ హైస్కూల్, హాకిన్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ఏవిఆర్ స్కూల్స్‌లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. టేలర్ హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సుదర్శన్ మాట్లాడుతూ నేటితరం విద్యార్థులకు తెలుగు సాంప్రదాయాలను గుర్తు చేస్తూ ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించినట్టు తెలిపారు.

చిత్తూరు అర్బన్: స్థానిక గంగనపల్లి సంసిద్ క్యాంఫోర్డ్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆహ్లాదకరమైన వాతావరణంలో భోగి మంటలు వేసి, రంగవల్లికలలో గొబ్బెమ్మలు పెట్టి సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. పలు పోటీలు పెట్టి బహుమతులు ఇచ్చారు. చిన్నపిల్లలకు భోగి పండ్లు పోశారు. ప్రధానోపాధ్యాయులు వి.అరుణ్ కుమార్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల జిల్లా ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రధానోపాధ్యాయులు బి. రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీ పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గొబ్బెమ్మలను పూలతో అలంకరించి పాటల పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, సిఆర్పి వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామకుప్పం: బాలికోన్నత పాఠశాల, బగళనత్తం బాలుర పాఠశాలల్లో రంగురంగుల ముగ్గులు వేసి భోగి మంటలు వేశారు. తెలుగు సాంప్రదాయాలతో పశువులకు పూల అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శిరీష, దాక్షాయని విద్యార్థినులు దానిమ్మ పొట్టుతో యాంటీ బయాటిక్ రోషన్లు, సోప్లను తయారీ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రధాన ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, రేణుక, ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా అభినందించి బహుమతులు అందించారు.

చిత్తూరులో..

కార్వేటినగరంలో..

క్రైం న్యూస్

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొస్తున్న గంగాధర్ రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సహదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఐ వివరాల మేరకు అప్పినపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ రెడ్డి రాజుపల్లెలోని ఎన్‌డిపిఎల్ వద్ద అదుపులోకి తీసుకోని, అతను వద్ద నుంచి 90 ఎం.ఎల్ 92, కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. మాధవ రెడ్డి అనే వ్యక్తి పరారీలో ఉన్నరని అతని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సహదేవి తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

సహించేది లేదు: సిఐ

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం మండల పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని పట్టణ నూతన సీఐ శంకరయ్య హెచ్చరించారు. గురువారం పట్టణ పరిధిలో దంపతుల మధ్య జరిగిన గొడవ ఘర్షణకు దారి తీసింది. భార్యాభర్తల గొడవలు సద్దుమణిగించే క్రమంలో పెద్దలు పంచాయితీ నిర్వహించారని, ఈ క్రమంలో మాటామాట పెరిగి ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు దాడికి తెగబడ్డట్టు సీఐ తెలిపారు. ఈ దాడులలో 10 మంది గాయాల పాలయ్యారని, అందులో కొంతమంది పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, తీవ్రంగా గాయాల పాలైన వారు పిఈఎస్ వైద్య కళాశాలకు చెందిన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టామని, విచారణ అనంతరం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ తెలిపారు.

మృతుడి కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల శెట్టివారివీధిలోని హరీష్ రాయల్ ఈనెల 1వ తేదీ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు వైఎస్సార్సీపి అభిమాని గత ప్రభుత్వంలో వాలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉండేవాడు. దీంతో గురువారం పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి మృతుడి ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు అండగా ఉంటారని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచి శ్రీరాములు, వైసిపి నాయకులు వరదం వెంకటరమణ, సాంబయ్య పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని వింజం గ్రామపంచాయతీ ఆవలాపూర్ గ్రామంలోని మైనారిటీ నాయకులు నూర్‌బాషా సతీమణి షబీర భాను అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనగంటి హరికృష్ణ గురువారం ఆవలాపూర్ గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళు లర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢసానుభూతి తెలిపారు. గ్రామ సర్పంచ్ రామక్క, ఎంపీటీసీ హనీఫ్ బాషా, మాజీ సర్పంచ్ గోవిందయ్య పాల్గొన్నారు.

సిఐని సన్మానించిన వాల్మీకులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం నూతన సిఐగా శంకరయ్య ఈనెల 4వ తేదీ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం కుప్పం పట్టణానికి చెందిన వాల్మీకి కులస్తులు నూతన సిఐను కలిసి స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు. పట్టణ పరిధిలో గతంలో సీఐగా పదవీ బాధ్యతలు నిర్వహించిన జిటి నాయుడు బదిలీ అనంతరం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ అర్బన్ సీఐగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనకు ముందు పట్టణ సిఐగా శంకరయ్య పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్ సురేష్, నాయకులు పాండు, విభూషణ్, రవి పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని దిగువ తడకర పుణ్యసముద్రం గ్రామాల్లో తహశీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని సమస్యలు తున్న వారు అర్జీలు అందించాలని సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపుతామని తహశీల్దార్ తెలిపారు. మండల సర్వే మురళీకృష్ణ, వీఆర్వో దామోదరం, రేఖ, సర్వేయర్లు బాబు, పయని, వేలు, ప్రశాంత్, బాలాజీ, భార్గవి, జయశ్రీ, సంధ్య, లీలాకుమార్, శ్రావణ్ కుమార్, తేజశ్రీ పాల్గొన్నారు.

విద్యాశాఖ పనితీరుపై ప్రజాప్రతినిధులు ధ్వజం

అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండల సర్వసభ్య సమావేశంలో విద్యాశాఖ అధికారుల పనితీరు సరిలేదని మండల ప్రాదేశిక సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మండల విద్యాశాఖ పనితీరుపై వాడీవేడిగా చర్చ జరిగింది. వీరప్పల్లి ఎంపీటీసీ కళవాతి సుబ్రహ్మణ్యం మండల విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు, మండల విద్యాశాఖలో చాలా సమస్యలు ఉన్న వాటిని పక్కన పెట్టి ఉపాధ్యాయ సంఘాల మధ్య చిచ్చు పెట్టేలా ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని దీనిపై వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించాలన్నారు. మండలంలో విద్యాశాఖ అధికారుల పనితీరుపై దినపత్రికల్లో కథనాలు రావడం ఆయన ముఖ్యంగా ప్రస్తావించారు. వీరప్పల్లిలో నాడు-నేడు పనులలో నిధులు దుర్వినియోగం అయ్యాయని వీటి పై ఎలాంటి చర్యలు తీసుకున్నారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. మండలంలోని డ్వాక్రా గ్రూపులు చాలా డిఫాల్ట్‌లో ఉన్నాయని వాటిని కూడా సంబంధిత అధికారులు స్పందించి ఆక్టివ్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కూడా వీరప్పల్లి ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం అధికారులను కోరారు. వీటిపై స్పందించిన విద్యాశాఖ అధికారులు సమస్యను ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందని వీటిపై ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి సుష్మా కీర్తి, ఎంపీడీవో బాలాజీ, సూపరింటెండెంట్ భాస్కర్, రెవెన్యూ ఆర్ఎస్‌డిటి రమేష్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ అధికారులు రెవెన్యూ సిబ్బంది సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ట్రెక్ చిత్తూరు' కార్యక్రమానికి

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలమనేరు: అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రెక్ చిత్తూరు కార్యక్రమానికి విచ్చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని గురువారం స్థానిక ఎఫ్ఆర్ఓ నారాయణ ఆహ్వానించారు. ఈనెల 12న పలమనేరు అటవీ పరిధిలోని మొగిలి వద్దనున్న దేవరకొండలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈకార్యక్రమానికి విచ్చేసి ప్రారంభించాలని ఆయన కోరారు. తదనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కుంకి ఏనుగుల ప్రాజెక్టు, గంగన్న శిరస్సు ప్రాజెక్టు తదితర అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో డాక్టర్ విజయ్ చంద్ర, అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ప్రతినెలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం సుఖ ప్రసవానికి, బిడ్డ ఎదుగుడలకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. మహర్షి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం మోడల్ స్కూల్‌లో చాలా కాలం నుండి విద్యార్థులకు తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడేవారు. తాగునీటి బోరులో సరిపడా నీరు రాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు కొత్త బోరు వేయించడంతోపాటు పైపులను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. దీంతోపాటు కొత్త విద్యుత్ ట్రాన్స్ఫారం నిర్మించారు. ఆయన వెంట క్లస్టర్ ఇంచార్జ్ హెమాంబర్ గౌడు, సర్పంచ్ గోపాల్, సుబ్రమణి, మోడల్ స్కూల్ ఛైర్మన్ రామచంద్రుడు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమి పూజ

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కమ్యూనిటీ భవనానికి గురువారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గాదేవి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జెసిఐ) చిత్తూరు గోల్డ్‌శాఖ ఆర్థిక సహాయంతో భవన నిర్మాణం చేపట్టనున్నారు. జెసిఐ అంతర్జాతీయ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ భరత్, వైస్ చైర్మన్ ప్రమోద్ మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. చిత్తూరు చాప్టర్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి చిరంజీవి, సిహెచ్‌ఓ శ్రీనివాసులు, సూపర్వైజర్ శైలజ, జెసిఐ చిత్తూరు చాప్టర్ మాజీ అధ్యక్షులు మనోహర్, మానస, మండల రెడ్ క్రాస్ అధ్యక్షుడు పాపిరెడ్డి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయ చంద్ర ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన వైదేహీ సూపర్ స్పెషాల్టీ హాస్పటల్ వైద్యులు గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మండలంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 250 మంది వైద్యశిబిరంలో వైద్యసేవలు పొందారు. వైద్యులు రోగులకు బిపి, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే పలువురికి ఈసీజీ చేసీ మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్యశిబిరంకు విశేష స్పందన లభించిందని వైదేహీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. తమ హాస్పటల్‌లో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ అమల్లో ఉందని అవసరమైన వారు శస్త్రచికిత్స చేయించుకోవచ్చు అని తెలిపారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో త్వరలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సును రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బెన్నురాజ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రీ సర్వే కింద మిట్టపల్లి రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేశారని ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ రీ సర్వేలో రైతులు ప్రజలు తమ భూ సమస్యలపై వినతిపత్రాలు అందజేసి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వైకుంఠ ఏకాదశికి

ముస్తాబవుతున్నఆలయాలు

ప్రజాశక్తి- సోమల: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని వైష్ణవ ఆలయాలు సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో, పుష్పాదులతో అందంగా ముస్తాబు అవుతున్నాయి. సోమల సమీపంలోని శ్రీభూనీల దేవి సమేత పరుష వెంకటేశ్వర స్వామి ఆలయం, కమ్మపల్లి, బురుజుపల్లి, చింతలవారిపల్లి, ఆవులపల్లి, నెల్లిమంద, మిట్టపల్లి గ్రామాలలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయాలలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. పదవ తేదీ ఉదయం నాలుగు గంటల నుండి స్వామివారి దర్శనాన్ని భక్తులకు కల్పించడం ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అన్ని ఆలయాలలో భక్తులకు తీర్థప్రసాద వినియోగం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జోనల్ గేమ్స్‌లో ఓవరాల్ ఛాంపియన్ శంకర్రాయలపేట

ప్రజాశక్తి- పెద్దపంజాణి: పలమనేరు జోన్ క్రీడల్లో మండలంలోని శంకర్రాయలపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు వేదవతి గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ బాలుర వాలీబాల్ రన్నర్స్, హ్యాండ్ బాల్ రన్నర్స్‌గాను, సాఫ్ట్ బాల్ విన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. అథ్లెటిక్స్ బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో హరిహర కుమార్, తరుణ్ మొదటి, తృతీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో హరిహర కుమార్, తరుణ్ మొదటి, ద్వితీయ స్థానం, హైజంప్ పోటీల్లో కార్తీక్ ద్వితీయ స్థానం, షార్ట్ కట్ పోటీల్లో సందీప్, సుశాంత్ మొదటి, తృతీయ స్థానం, డిస్కస్ త్రోపోటీల్లో సందీప్, సుషాంత్ మొదటి, తృతీయ స్థానం, పరుగుపందెం సందీప్, తరుణ్, సుషాంత్, హరిహర కుమార్ మొదటి స్థానం సాధించారు. సీనియర్ బాలికల విభాగంలో హై జంప్ పోటీల్లో పూర్ణమి మొదటి స్థానంలోనూ, షార్ట్ కట్ పోటీల్లో గంగోత్రి తృతీయ స్థానం, పరుగు పందెంలో గంగోత్రి, పూర్ణమి, రేవతి, మానస ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. జూనియర్ బాలుర విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో పార్థు, ప్రణీత్, చందన్ కుమార్ మొదటి, ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో నవీన్ ద్వితీయ స్థానం, 600 మీటర్ల పరుగుపందెంలో సోహన్ ద్వితీయ స్థానం, లాంగ్ జంప్ పోటీల్లో నవీక్ మొదటి స్థానం, పరుగు పందెంలో పార్థు, ప్రణీత్, సోహన్, చందన్, నవీన్ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. జూనియర్ బాలికల విభాగంలో లాంగ్ జంప్ పోటీల్లో రూప తృతీయ స్థానం, పరుగు పందెంలో అక్షయ, రూప, సుజన, సంగీత ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. పలమనేరు జోన్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

ప్రతిభచాటిన బైరెడ్డిపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సెప్టెంబర్ నెలలో జరిగిన జోనల్ గేమ్స్‌లో పాల్గొన్నారు. ఈ గేమ్స్‌లో పలమనేరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల విద్యార్థులు పాల్గొనగా బాల్ బ్యాడ్మింటన్‌లో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎస్. సిద్ధిక్, ఎస్.మైనుఉద్దీన్, ఎస్.బాబు, ఈశ్వర్, ఎస్ఏ.అయాన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి పొందారు. అలాగే 400 మీటర్ల రన్నింగ్ రేస్‌లో నవీన్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా రాష్ట్రస్థాయిలో సాఫ్ట్ టెన్నిస్‌లో పి.శన్మేంద్ర ఉత్తమ ప్రతిభను కనపరిచాడు. గురువారం గెలుపొందిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం నసీబ్జాన్ పాఠశాల, పిటీ ఉపాధ్యాయులు జి.సుజాతను అభినందించారు.

ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ప్రజాప్రతినిధుల నిరసన

ప్రజాశక్తి- గంగవరం: మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించకుండా ఎంపీడీవో సొంత నిర్ణయం తీసుకొని సమావేశం నిర్వహిస్తే ఎవరు హాజరైతారని ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పిటిసి సభ్యురాలు నిలదీసి సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఎంపీడీవో, ఎంపీపీ ఎప్పుడు ఎన్ని గంటలకు సమావేశం నిర్వహిస్తున్నారని తమకు సరైన సమాచారం ఇవ్వలేదని అయినా తామందరం 11 గంటలకు మండల అభివృద్ధి కార్యాలయానికి చేరుకున్నామని సభ్యులు తెలిపారు. అయితే అప్పుడు మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమని అప్పటి వరకు వేచి ఉండాలని తెలిపారని, కనీసం తాగడానికి నీరు, ఆహారం కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఓ తమకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని, ఇటువంటి ఎంపిడివో తమకు వద్దని మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి కార్యాక్రమాలకు మంజూరైన నిధులకు సైతం పర్మిషన్ ఇవ్వకుండా నిధుల వృథా అయిపోతున్నాయని పలువురు సర్పంచులు తెలిపారు. సరైన సమయంలో నిధులు మంజూరు చేయకపోవడం వలన నాలుగు నెలల ముందు మంజూరైన పనులు నిలిచిపోయాయని, దానికి కారణం ఎంపిడివో బాధ్యాతారాహిత్యమని అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో కనీసం తాగునీరు, మౌలిక వసతులు కూడా లేవని అడిగే సిబ్బంది సైతం సభ్యులపై విరుచుకుపడుతున్న పరిస్థితి ఉందని అన్నారు. పైస్థాయి అధికారులు చొరవ చూపి ఎంపిడిఓ కార్యాలయంలో ఉన్న పరిస్థితులను చక్కదిద్దాలని ప్రజాప్రతినిధులు కోరారు.

నిరసన వ్యక్తం చేస్తున్న మండల ప్రజా ప్రతినిధులు

సమన్వయంతో పిసిపిఎన్‌డిటి చట్టం అమలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి: డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు జిల్లాలో ప్రతి 1000 మంది మగ శిశువులకు 892 మంది ఆడ శిశువులు ఉన్నారు. పిసిపిఎన్‌డిటి చట్టం అమలు పటిష్టంగా అమలు చేసి ఆడపిల్లలను కాపాడుకోనేందుకు న్యాయ శాఖ, పోలీసు శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పని చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుధారాణి తెలిపారు. పిసిపిఎన్‌డిటి చట్టం అమలుపై ప్రజాశక్తికి తెలియజేస్తూ ఎవరైన చట్టవిరుద్ధమైన కార్యకలాపాలైన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడిన వారు చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు అమలు చేయడంతోపాటు వైద్య, ఆరోగ్యశాఖ అలాగే పోలీసు, విజిలెన్స్ శాఖవారు ప్రతినిత్యం గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడుచున్నవారిపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో చట్టంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి ప్రజలకు చట్టంలోని శిక్షలు, జరిమానాల గురించి తెలియజేయాలన్నారు, ఎవరైనా ఈ చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడుచున్న, ప్రోత్సహిస్తున్న, ప్రోద్భలం చేయుచున్న వారి వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో లింగ నిష్పత్తిని సమాన స్థాయికి తీసుకొచ్చేలా అధికారులు కృషి, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి బృందాల ద్వారా డివిజినల్ స్థాయి బృందాల ద్వారా నెలకు 20 తనిఖీలు, 20 డెకాయి ఆపరేషన్లు తప్పక చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వారి వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలని, ఎవరైన అనుమతులు లేకుండా స్కానింగ్ కేంద్రాలు నడుపుతున్నట్లు అయితే స్కానింగ్ సెంటర్లను గుర్తించి వాటిపై చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మండలాల్లో విస్తృతంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ప్రజలలో ఉన్న మూడ నమ్మకాలను పారద్రోలి ఆడ, మగ తేడా లేదని సమాజంలో మహిళలకు సమాన స్థానం కల్పించాలని కరపత్రాల ద్వారా, మైకింగ్ ద్వారా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. మొదటిసారి ఈ చట్ట పరిధిలో చేసిన ఏదేని తప్పుకు 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, రెండవసారి 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, రూ.50వేలు జరిమానా. తల్లిదండ్రులు, భర్త , బంధువుల , ఇతర వ్యక్తులు , వైద్య సంస్థలు ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని భాద్యులని తెలిసినా లేదా ఈపరీక్షలను ఉపయోగించినారని తెలిసినప్పుడు మొదట చేసిన తప్పుకి గాను 3 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా, రెండోసారి అదే తప్పు చేస్తే 5 సంవత్సరాలు జైలు శిక్ష, లక్షరూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. నేర నిర్ధారణ జరిగితే వారి పేరు వైద్య మండలి రిజిష్టరు నుండి 5 సంవత్సరాల వరకు తొలగింపడుతుందని, రెండో సారి ఆదే తప్ప జరిగితే రాష్ట్ర వైద్య మండలి సంఘం నుండి శాశ్వతంగా తొలగింపబడుతుందనీ తెలిపారు.